క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖినది ఒడ్డున ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ సముదాయంలో గల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో గురువారం ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు నిత్య పూజలు చేయించిన అనంతరం ముడుపుల పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉపవాసాలతో పాల్గొన్న కారణంగా ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకూ అభిషేకాలు, పూజలు, ముడుపుల పూజలు జరిగాయి.

లీకవుతున్న మంచినీటి పైప్‌లైన్



చిలకలపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద లీకవుతున్న పైప్‌లైన్

బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి ప్రాథమిక పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం పైప్‌లైన్ లీకు అవడంతో నీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ లీక్ కావడంతో లీకుల ద్వారా కలుషిత నీరు లోపలికి వెళ్లే ఆస్కారముందని గ్రామస్తులు చెబుతున్నారు. కలుషిత నీరు సరఫరా జరిగితే అంటు వ్యాధులు సోకుతాయని, వెంటనే దానికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వీఆర్‌ఎస్ ప్రాజెక్ట్‌ను పరిశీలించిన జైకా



వీఆర్‌ఎస్ ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న జైకా బృందం సభ్యులు

మక్కువ: మండలంలో గల వెంగళరాయ సాగర్ ప్రాజెక్టును జైకా బృందం గురువారం సందర్శించింది. ఈ పర్యటనలో భాగంగా కుడి ప్రధాన కాలువపై చేపట్టిన లైనింగ్ పనులను పరిశీలించారు. అలాగే సువర్ణముఖి స్పిల్ వే రెగ్యులేటర్‌ను కూడా బృందం సభ్యులు పరిశీలించారు. ప్రాజెక్ట్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో నిధులు మంజూరు కానున్నాయని, పనులు ముందుకు సాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని జైకా బృందం సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. బృందంలో జైకా రాష్ట్ర కోఆర్డినేటర్ సబ్జన్‌తో పాటు ఆర్.మోహన్‌రావు, ప్రాజెక్ట్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, ఎస్‌డీసురేష్, డీఈఈ పి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాబాకు ప్రత్యేక పూజలు



బాబాకు నిర్వహించిన పూజల్లో పాల్గొన్న సాయి భక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో గల సాయిబాబా ఆలయంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం కాకడ హారతి అనంతరం భక్తులకు బాబా దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా బాబాకు క్షీరాభిషేకం, పుష్పాభిషేకాలను సాయి భక్తులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేపట్టగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సేవలతోనే గుర్తింపు



బదిలీ అయిన కార్యదర్శిని సన్మానిస్తున్న డీపీఓ కొండలరావు

గరుగుబిల్లి: ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పని చేసిన వారికే సమాజంలో గుర్తింపు ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. తోటపల్లి పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహించి ఉల్లిభద్ర పంచాయతీకి బదిలీపై వెళ్లిన శ్రీనివాసరావుకు తోటపల్లి సచివాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోటపల్లి గ్రామాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపించి ప్రజల మన్ననలను పొందడం ఎంతో అభినందనీయమని చినమేరంగి సీఐ టి.తిరుపతిరావు అన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, కన్నయ్య, పకీరు నాయుడు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా



తోణాం గ్రామంలో దున్ని చదును చేసి ఆక్రమించిన ప్రభుత్వ భూమి

- బరితెగిస్తున్న అధికార పార్టీ నాయకులు
- అధికారులు హెచ్చరించినా పట్టించుకోని పరిస్థితి

ఆక్రమణ దారును హెచ్చరించాం

ప్రభుత్వ భూమిని దున్నుతున్నట్లు ఫిర్యాదు అందింది. వెంటనే వెళ్లి ప్రత్యక్షంగా ఆక్రమణదారును హెచ్చరించాను. ఇంకా భూమిపై పంట వేయాలని చూస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తాను.

– వీఆర్‌ఓ నాని, తోణాం

సాలూరు రూరల్:

మండలంలోని తోణాం గ్రామంలో సర్వే నంబర్ 27/3పిలో సుమారు 100 సెంట్ల భూమిని స్థానిక అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు దర్జాగా కబ్జా చేశాడు. ఈ విషయంలో గ్రామ వీఆర్‌ఓ నాని ఆక్రమణదారును హెచ్చరించినా పట్టించుకోకుండా తనపని తాను చేసుకుపోతున్నాడు. ట్రాక్టర్ పెట్టి భూమిని దున్ని అందులో పంటవేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. అయితే స్థానిక ప్రజలు ఆ భూమి ఆక్రమణ విషయంలో సూటిగా ఆక్రమణ దారుడిని ప్రశ్నించలేక అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీనిపై స్పందించిన అధికారులు హెచ్చరించినా సదరు ఆక్రమణదారు పట్టించుకోకపోవడం విశేషం. అధికార పార్టీ అండదండలున్నాయన్న ధీమాతోనే ఆక్రమణ దారు అలా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇదిలా ఉండగా అదేస్థలం పక్కన గతంలో జగనన్న కాలనీని గత ప్రభుత్వం నిర్మించి పేదలకు ఇళ్లు ఇచ్చింది. మిగిలిన ఈ స్థలం ప్రస్తుతం కో ఆపరేటివ్ సొసైటీ గొడౌన్లు కట్టుకోడానికి రెవెన్యూ శాఖవారు అప్పగించినట్లు వీఆర్‌ఓ నాని చెబుతున్నారు. అయినా దౌర్జన్యంగా భూమిని దున్ని పంటవేసేందుకు సిద్ధం అవుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామప్రజల అవసరాల మేరకు వినియోగించుకోవాల్సిన స్థలాన్ని ఒక్కడే ఆక్రమించడం భాదాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిత్తవుతున్న పత్తి రైతు



- పట్టించుకోని ప్రభుత్వం

సాలూరు రూరల్: రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని ఎన్నికల ప్రచారంలో ఊకదంపుడు ప్రసంగాలతో హామీలు గుప్పించిన నాయకుల మాటలు అధికారంలోకి రాగానే ఆ హామీలన్నీ నీటిమీద రాతలేనని స్పష్టంగా తేలిపోయింది. ఇచ్చిన హామీలు గాలికొదిలేసిన ప్రభుత్వ వ్యవహార శైలితో ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో పండించిన పంటను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సాలూరు మండలంలో ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా లేదు. అయితే ఏదో పండిన పంట ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని ఆశించినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవడమే మేలు అన్నట్లుగా ప్రభుత్వ తీరు కనిపిస్తోందని రైతులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ఏఎంసీలో పత్తి కొనుగోలు చేయాలని కోరినప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదని లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కొనుగోలు కేంద్రాన్ని రామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలసలో ఏర్పాటు చేశారు. అయితే సాలూరు నుంచి పత్తి అక్కడికి తీసుకువెళ్తే పొరపాటున నాణ్యత లేదంటూ ఏమైనా సాకులు చెబితే మరింత భారమయ్యే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.7120 ధర నిర్ణయించినప్పటికీ ప్రైవేట్ వ్యాపారులకు రూ.6వేలకే స్థానికంగా రైతులు విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సరైన ధర ఇవ్వకపోవడమే కాకుండా తూకంలో కూడా అదనంగా తీసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పనితీరుతో నష్టాలబారిన పడ్డామని వాపోతున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజాసహకారం తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

సాలూరు: ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రజల సహకారం తప్పనిసరి అని, కావున ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని తన కార్యాలయంలో సీఐ అప్పలనాయుడుతో కలిసి మహిళాపోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చినబజార్, గొల్లవీధి జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌పై చర్చించారు. వన్ వే ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన పెంపొందించాలని పోలీసులను కోరారు. కార్యక్రమంలో డీఈ, టౌన్‌ప్లానింగ్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్ కేంద్రం పరిశీలన



ఎన్‌ఆర్‌సీలో పిల్లల వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో ఉన్న పోషకాహార పునరావాస కేంద్రాన్ని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్ రావు గురువారం పరిశీలించారు. కేంద్రంలో చేరిన ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య వివరాలను కేస్‌షీట్‌లో ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రతి బెడ్‌ను పరిశీలించి చిన్నారుల ఆరోగ్య వివరాలు ఆడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చేరినప్పుడు బరువు, ఎదుగుదల ప్రస్తుత బరువు ఏ మేరకు వృద్ధి చెందిందో తూనిక పరికరం ద్వారా గమనించారు. పోషకాహారంతో పాటు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ వేయాలని కేంద్రం సిబ్బందికి ఆయన సూచించారు. పిల్లలకు మల, మూత్ర విసర్జన తర్వాత చేతులు పరిశుభ్రం చేసుకోవాలని, పిల్లలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆహారం తినిపించేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఎస్‌ఓ శంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశ నుంచే పఠనాసక్తి అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు టి. శివకేశవ రావు

పార్వతీపురంటౌన్: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పఠనాసక్తిని అలవర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు టి.శివకేశవ రావు అన్నారు. ఈ మేరకు గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా నర్సిపురం ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలోని నీతి శతకాలను నేర్చుకోవడం ద్వారా ఉత్తమ పౌరులుగా రూపొందుతారన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు మెమెంటోలు, బహుమతులను అందజేశారు. ఏడో తరగతికి చెందిన యెర్రా వర్షిణి, ఆరో తరగతికి చెందిన పడాల నందు ప్రథమ ద్వితీయ స్థానాలను పొందారు. వారిని మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘం కార్యదర్శి ఎస్ బాలకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటనాయుడు, విజయ, నిర్మల, మణి, బీవీ పట్నాయక్, రమేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐతో అనుసంధానం తప్పనిసరి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో ఉన్న వేతనదారులందరూ తపాలా శాఖ ద్వారా ప్రభుత్వ ఫలాలు పొందాలంటే అందరి ఖాతాలకు ఎన్‌పీసీఐతో లింక్ చేయాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో తపాలా శాఖ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సమావేశంలో ఏపీఓ జి.సత్యంనాయుడు, ఏపీఎం రాము, సబ్ పోస్టుమాస్టర్ ఎస్.కృష్ణ, పోస్ట్‌మన్ టి.రవిబాబు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్



బలిజిపేటలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న మహిళలు

పార్వతీపురంటౌన్: విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో న్యాయ విద్యార్థినిని ప్రేమ పేరుతో నయవంచన చేసి దారుణంగా లైంగిక దాడికి పాల్పడిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థిని ఈ అమానుషత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యకు సిద్ధపడిందంటే ప్రభుత్వ, పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం లేని స్థితి కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజూ మహిళలు, పిల్లలపై నేరాలు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం అన్యాయమని మండిపడ్డారు. నిందితులకు సరైన శిక్షలు పడకపోవడం, కేసుల విచారణలో జాప్యం జరగడం వల్ల దుండగులు మరింత పెట్రేగిపోతున్నారన్నారు. ఈ ఘటనలో బాధిత విద్యార్థినికి వారి కుటుంబానికి మనోధైర్యం కల్పించే చర్యలు తీసుకోవాలని, దారుణానికి పాల్పడిన దుర్మార్గుల్ని శిక్షించి సత్వరన్యాయం చేసే విధంగా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు పెట్టాలని కోరారు. ఇలాంటి ఘటనలపై యువతలో సామాజిక స్పృహను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక క్యాంపెయిన్ చేపట్టాలని కోరారు. మహిళలు, విద్యార్థులు సంఘటితంగా ఉంటూ ఇలాంటి దుర్మార్గాలు, అకృత్యాలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

మహిళల కొవ్వొత్తుల ర్యాలీ

బలిజిపేట: విశాఖలో 'లా' విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఐద్వా నాయకురాలు లక్ష్మమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథ రావులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో పని ప్రదేశాల్లో మహిళలు, విద్యార్థులకు రక్షణ కరువైందన్నారు. ఈ భద్రత వైఫల్యాలకు కాణం కూటమి ప్రభుత్వమేనన్నారు. మహిళలపై అత్యాచారాలు, దాడులకు విశాఖ అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య రాష్ట్రంలో సుమారు 96మంది వరకు మహిళలు బలిపశువులుగా మారారని, ఆయా ఘటనలకు కారకులైన వారిపై కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వారి వైఫల్యాన్ని చాటిచెబుతోందన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులైపారుతోందని, గంజాయికి పుట్టినిల్లుగా మారుతోందన్నారు. కార్యక్రమంలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్నా



గ్రామాల్లో నిరంతరం పారిశుధ్యపనులు నిర్వహించి సేవలందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మన్మథరావు డిమాండ్ చేశారు. గ్రీన్‌అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు ధర్నా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వై.మన్మథరావు, సిటు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షుడు జలుమూరు గౌరు, గుంట పోలయ్య, తోటరాము, సీహెచ్. శివున్నాయుడు, పెంకి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. – సీతానగరం

● విజ్ఞప్తి



మండలంలోని పాఠశాల శానిటేషన్ వర్కర్స్ పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ గురువారం ఎంఆర్సీ వద్ద సిబ్బంది భద్రకు ఆయాలు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయాల సంఘ నాయకురాలు లక్ష్మమ్మ మాట్లాడుతూ పాఠశాలలో ఆయాలకు గడిచిన 5నెలలుగా జీతాలు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. కార్యక్రమంలో తులసి, రజిని, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. – బలిజిపేట

● డిమాండ్



విద్యాలయాల్లో పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.శాంతకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలవిద్యావనరుల కేంద్రం ఆవరణలో పారిశుధ్య కార్మికులతో కలిసి ధర్నా చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ జి.సూరిదేముడుకు అందజేశారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్ల సంక్షేమ సంఘం మండల ప్రతినిధులు అనూష, గౌరమ్మ, సత్యవతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు. – సీతానగరం

యువత ఆరోగ్యం పట్ల జాగ్రత్తలుతీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా చూడాల్సిన అవసరం పేరెంట్స్‌పై ఉందని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరంలోని వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం ఏపీఎం రెడ్డి శ్రీరాములు అధ్యక్షతన సంకల్పం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల కారణంగా యువత ఆరోగ్యం ఏవిధంగా క్షీణిస్తుందో వెలుగు సభ్యులకు వివరించారు. పిల్లల ఆరోగ్యం పట్ల పేరెంట్స్ ముందు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలంతా మాదక ద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించుకుని యువతకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై లంక శ్రీనివాసరావు, వెలుగు సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

26న రైతు, కార్మికుల ర్యాలీ



కురుపాంలో కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న పార్వతీపురంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రైతు, కార్మిక వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు తోట జీవన్న, గరుగుబిల్లి సూరయ్య తెలిపారు. కురుపాం మండల కేంద్రంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను కార్మికులతో కలిసి గురువారం విడుదల చేశారు. గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి సర్వ సంపదలు సృష్టించేది రైతులు, కార్మికులేనని, అటువంటి వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా పని చేస్తున్నాయన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 24న అన్ని మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 26న నిర్వహించే ర్యాలీకి పెద్ద సంఖ్యలో రైతులు, కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు.